సాక్షి ఒడిశా

సోమవారం । 17 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,76,169లు, బంగారం 4.55 గ్రాములు, వెండి 39.3 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ఆమ్ ఆద్మీతోనే అభివృద్ధి సాధ్యం

- 8లో



రాష్ట్రంలో మరో కోవిడ్ మృతి

- 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి ఉదయం పూట బడులు

భువనేశ్వర్: పెరుగుతున్న ఉష్ణోగ్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో ఉదయం పూటబడులు తెరిచి తరగతులు నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 17(సోమవారం) నుంచి తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంత వరకు నిరవధికంగా తరగతుల నిర్వహణ కొనసాగుతుంది. 1 నుంచి 12వ తరగతులకు నిత్యం ఉదయం 6.30 గంటల నుంచి 11.00 గంటల వరకు ఉదయం పూట తరగతులు నిర్వహించాలని ఉత్తర్వులు పేర్కొన్నాయి. వడగాడ్పుల తీవ్రత నేపథ్యంలో ఈనెల 16వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలలకు ఆకస్మిక సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్లు తమ ప్రాంతీయ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రధానంగా వేడిగాలుల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని పాఠశాల సమయాలను సవరించవచ్చని ప్రకటనలో సూచించారు. పాఠశాల ఆవరణలో తాగునీరు, ఇతర మౌలిక సౌకర్యాలు విద్యార్థులకు అనుక్షణం అందుబాటులో ఉండేలా చూడాలని వివరించారు.

గజపతి జిల్లాకు ఉత్తమ స్కౌట్స్ పురస్కారం



గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న అధికారులు

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని మహారాజా బాలుర ఉన్నత పాఠశాల బాయ్స్ స్కౌట్స్, గైడ్స్ బృందానికి జిల్లా ఉత్తమ స్కౌట్స్‌గా పురస్కారం లభించింది. దీనికి సంబంధించి భువనేశ్వర్‌లో జరిగిన అవార్డు ప్రదానోత్సవం కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ గణేషీలాల్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. గజపతి జిల్లా ముఖ్య విద్యాధికారి ప్రదోష్‌కుమార్ నాయక్, ఇన్‌చార్జి క్రీడాధికారి సురేంద్రకుమార్ పాత్రో, హెచ్ఎం బిజయకుమార్ గౌడో కార్యక్రమంలో పాల్గొన్నారు. బహుమతిగా మెమెంటో, ధ్రువపత్రాన్ని సురేంద్రకుమార్ స్వీకరించారు. స్కౌట్స్, గైడ్స్ జిల్లా కమిషనర్ గైడ్స్ ఎస్.మణిమాల, డీఓసీ సంజయ్‌కుమార్ పాత్రో, ధీరేంద్ర సామల్ తదితరులు అభినందించారు.

మిషన్‌శక్తి భవనం ప్రారంభం



భవనం ప్రారంభోత్సవంలో మంత్రి సరక, అనసూయ తదితరులు

రాయగడ: రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖమంత్రి జగన్నాథ సరక జిల్లాలోని గుడారిలో సుమారు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన మిషన్‌శక్తి భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్‌పర్సన్ అనసూయ మాఝి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గుణుపూర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్యే రఘునాథ గమాంగొ, బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్, గుడారి, అనిసా దాస్ తదితరులు పాల్గొన్నారు. మహిళ ఆర్థిక సాధికారతకు మిషన్‌శక్తి ఎంతో సత్ఫలితాలు ఇస్తుందని తెలిపారు. అనంతరం పద్మపూర్ లోని ఆర్‌జీ కళాశాలలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రంథలయాన్ని మంత్రి ప్రారంభించారు.

అంతా ఒక్కటే..



నేలపై కూర్చుని ఆహారం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పీతం పాఢి

కొరాపుట్: ఎమ్మెల్యే అయినా అక్కడ నిబంధనలు పాటించాల్సిందే. కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి ముస్సురి గ్రామంలో అలేఖ్ మతస్తుల ధార్మిక సమ్మేళనం ఎమ్మెల్యే జరిగింది. ఈ కార్యక్రమాన్ని పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాఢి సందర్శించారు. అక్కడ అతిథులకు ఆహారం పెడతారు. దీనిని ప్రసాదంగా స్వీకరించి తప్పని సరిగా వెళ్లాలి. వారి నిబంధనలు ప్రకారం ఆహారం నేలపై కూర్చుని తినాలి. ఎటువంటి టేబుల్లు, కుర్చీల మీద ఆహారం ఇవ్వరు. దీంతో ఎమ్మెల్యే కూడా అక్కడి వీధిలో ఏర్పాటు చేసిన నేలపై కూర్చుని ఆహారం స్వీకరించారు.

సమైక్యతతో.. సాగుదాం

- రాయగడలో ఉత్సాహంగా ముగిసిన పొనా సంబరాలు
- ఆకట్టుకున్న కళాకారుల నృత్య ప్రదర్శనలు
- వేర్వేరు వేదికలపై నిర్వాహనలో అనుమానాలు



అశోక్ మండపం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నెక్కంటి

రాయగడ: ఒడియా ప్రజల నూతన సంవత్సరం పొనా సంక్రాంతి సంబరాలు రాయగడలో ఈ ఏడాది మూడు వేదికల్లో నిర్వహించారు. పట్టణంలోని గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్‌పర్సన్ నిరంజన్ భక్షిపాత్రో అధ్యక్షతన, తేజస్విని హోటల్ ఎదురుగా ఉన్న మైదానంలో రాయగడ మజ్జిగౌరి మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడ్డిక కన్వీనర్‌గా, జీసీడీ మైదానానికి ఆనుకొని ఉన్న అశోక్ కల్యాణ మండపంలో మరో వేదిక ఏర్పాటైంది. అయితే ఏటా ఒకే వేదికగా పొనా సంబరాలు జరుగుతుండగా.. ఈదఫా మూడు వేదికల్లో జరగడం చర్చనీయాంశంగా మారింది. ఉత్సవాలను సమైక్యంగా నిర్వహిస్తున్నామని ఒకరికి ఒకరు చెప్పుకుంటున్నప్పటికీ వేర్వేరుగా జరగడం పలు అనుమానాలకు తావిస్తున్నట్లయ్యింది. కొద్ది రోజుల క్రితం తెలుగువారి ఉగాది సంబరాలు ఎన్నడూ లేనివిధంగా రెండు వేదికల్లో జరిగాయి. ఇకపై ఇటువంటి ఉత్సవాలు, సంబరాలు ఇదే తరహాలో జరుగుతాయనడంలో సందేహం లేదన్న అభిప్రాయాలకు తావిస్తోంది. ఏది ఏమైనప్పటికీ ఒకరికి మించి మరొకరు సంబరాలను ఘనంగా నిర్వహించి, తమ సత్తా చాటుకునే విధంగా ఆస్కారం ఏర్పడింది.

ముగిసిన సంబరాలు..

పట్టణంలో మూడు వేదికల్లో జరిగిన పొనా సంబరాలు శనివారం సాయంత్రం ముగిశాయి. స్థానిక తేజస్విని హోటల్ గ్రౌండ్‌లో సంబరాలు ఒకేరోజుకు పరిమితమయ్యాయి. గోవింద చంద్రదేవ్ మైదానం, అశోక్ కల్యాణ మండపంలో జరిగిన సంబరాలు రెండు రోజులు నిర్వహించారు. అశోక్ మండపంలో జరిగిన ముగింపు సంబరాలకు రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగే ముగింపు వేడుకలకు రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక పాల్గొన్నారు. గౌరవ అతిథులుగా, ఐర్మన్ అనసూయ మాఝి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి తదితరులు హాజరయ్యారు. రాయగడ మకరంద ముదులి 2కార్యక్రమాల్లో పాల్గొని, మద్దతు తెలిపే విధంగా వ్యవహరించారు.

ఎస్పీకి సత్కారం..

గత రెండు రోజులు జరిగిన ఉత్సవాల్లో తమకు సహకరించిన జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ, ఐఐసీ నీలకాంత్ కుహూరాలకు అశోక్ మండపం వద్ద జరిగిన సంబరాల వేదిక వద్ద నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. శాంతి భద్రతలకు ఎటువంటి భంగం వాటిల్లకుండా సంబరాలకు తీసుకున్న చర్యలకు సత్కరించారు.



హుషారెత్తిస్తున్న రుతురాజ్



ఎస్పీ శర్మను సత్కరిస్తున్న నిర్వాహకులు



ప్రేక్షకుల మధ్య గాయకుడు బొబి



కళాకారుల నృత్య ప్రదర్శన

అలరించిన కార్యక్రమాలు..

అశోక్ కల్యాణ మండపం, గోవిందచంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన ముగింపు సంబరాలకు ఒడియా చలనచిత్ర నేపథ్య గాయకులు హాజరయ్యారు. ప్రముఖ గాయని శర్మిష్ఠ సర్కార్, గాయకులు విష్ణుమోహన్ బొబి, ప్రశాంత్ నాయక్, ఆర్.రాజ్‌కుమార్, జ్యోతి బీసీలు ఆలపించిన భజన గీతాలు అలరించాయి. అదేవిధంగా యువగాయకుడు రుతురాజ్ ఆధునిక పాటలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. అలాగే విష్ణు మోహన్ బొబి ప్రేక్షకుల మధ్యకు దూరి వారితో నృత్యం చేసి అలపించిన గీతాలు చెదరని ముద్రగా నిలిచాయి. యువతీ, యువకులు కేరింతలు, నృత్యాలతో అశోక్ మండపం మార్మోగింది.



కార్యక్రమాలను తిలకిస్తున్న మంత్రి సరక, చైర్‌పర్సన్లు అనసూయ, సరస్వతి తదితరులు

జగన్నాథునికి యజ్ఞోపవీత సేవ

- భక్తులకు తాత్కాలికంగా దర్శనం నిలిపివేత



భువనేశ్వర్: పూరీ శ్రీమందిరంలో సోమవారం మూలవిరాట్ దర్శనం తాత్కాలికంగా నిలిపి వేయనున్నారు. వైశాఖ బహుళ ద్వాదశి పురస్కరించుకుని స్వామివారికి యజ్ఞోపవీత సేవ నిర్వహించనున్నారు. ఈ సేవ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిరవధికంగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఈ వ్యవధిలో భక్తులకు గర్భాలయంలో పూజలందుకుంటున్న మూల విరాట్‌ల దర్శనం తాత్కాలికంగా నిలిపి వేయనున్నట్లు శ్రీమందిరం అధికార వర్గాలు తెలిపాయి. నిత్యం నిర్వహించే ద్వితీయ భోగ మండపసేవ అనంతరం యజ్ఞోపవీత సేవ ప్రారంభించడం ఆచారం.

గోప్య సేవ..

శ్రీమందిరం రత్న వేదికపై కొలువుదీరిన మూల విరాట్‌లకు నిర్వహించే యజ్ఞోపవీత సేవ అత్యంత గోప్యం. దైతపతి సేవకులు ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాలుపంచుకుని నిర్వహిస్తారు. పట్టు సేవకులు(పత్రా సేవక్) స్వామి యజ్ఞోపవీతం తయారీకి పట్టు పోగులు సిద్ధం చేస్తారు. ఈ పోగులను దెవులా కొరొణొ సేవకులకు అందజేస్తారు. శ్రీమందిరం ప్రాంగణంలో నెలకొన్న శ్రీమహాలక్ష్మి ఆలయం నాట్య మండపం ప్రాంగణంలో దెవులా కొరొణొ సేవలకు యజ్ఞోపవీతం పోగు పోసి, దైతపతి సేవకులకు అందజేస్తారు. వీటిని స్వామికి సమర్పించడంతో పాయితా లగ్గి సేవ ముగుస్తుంది. యజ్ఞోపవీత సేవను స్థానికంగా పాయితా లగ్గి అని వ్యవహరిస్తారు. ఈసేవ దాదాపు 4 గంటలపాటు నిరవధికంగా కొనసాగుతుంది.

553కిలోల గంజాయి స్వాధీనం



బరంపురం: సీజ్ చేసిన గంజాయి, ఆటో

- నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

బరంపురం: రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది జరిపిన దాడిలో 453కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నలుగురు నిందితులను అరెస్ట్ చేయగా, మరికొందరు పరారయ్యారు. వివరాలు పరిశీలిస్తే.. కొందమాల్-గంజాం జిల్లా సరిహద్దు పిరింగియా పోలీసు స్టేషన్ పరిధి కళింగా ఘాటీలో బైక్‌లపై అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో 152కిలోల గంజాయి సీజ్ చేశారు. అయితే నిందితులు వాహనాలను విడిచి పరారవ్వడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అడ్డుకున్న పోలీసులు..

కొరాపుట్: జిల్లాలోని పొట్టంగి పోలీస్ స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఎస్‌డీపీఓ మనోజ్‌కుమార్ బెహరా వివరాలు ప్రకటించారు. లారీలో గంజాయి తరలిస్తున్న బృందంపై దాడిచేసి, 221కిలోల గంజాయి గుర్తించారు. వీరంతా హర్యానా రాష్ట్రానికి చెందిన మహ్మద్ ఖాసీం, సాహిద్‌ఖాన్, మహ్మద్ ముస్తాఫా లను అరెస్ట్ చేశారు.

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి ఎంవీ-32 గ్రామం వద్ద వాహన తనిఖీలు నిర్వహించిన పోలీసులు 180 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నిందితుడు సోమేంద్‌ను అరెస్ట్ చేసి, నవరంగ్‌పూర్ కోర్టుకు తరలించనున్నట్లు తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌డీపీఓ మనోజ్‌కుమార్



గంజాయితో పట్టుబడిన నిందితుడు

ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు

- పూరీ రైల్వేస్టేషన్‌ను సందర్శించిన కేంద్రమంత్రి దర్శనా జర్దోష్



పూరీ రైల్వేస్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న రైల్వేశాఖ మంత్రి దర్శనా జర్దోష్



పునర్నిర్మాణ పనులపై సమీక్షిస్తున్న కేంద్రమంత్రి దర్శనా జర్దోష్

భువనపర్: కేంద్ర రైల్వే, చేనేతశాఖ సహాయమంత్రి దర్శనా జర్దోష్ ఆదివారం పూరీ రైల్వేస్టేషన్‌ను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ పునర్నిర్మాణ పనులను సమీక్షించారు. ఆమెతో పలువురు రైల్వే అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రయాణికులకు కల్పించిన సౌకర్యాలు, ఆవశ్యకతను అధికారులు ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు. రైల్వే అధికారులతో జరిగిన చర్చలో, పర్యాటకులు, యాత్రికులను దృష్టిలో ఉంచుకుని అన్ని రకాల ప్రయాణికులకు సౌకర్యాలను అందుబాటులోకి తేవాలని నొక్కి చెప్పారు. పునరాభివృద్ధి పనులతో పాటు అన్ని రకాల ప్రయాణికులు, పేదలు, వెనుకబడిన ప్రయాణికులపై దృష్టి సారించాలని సూచించారు. ప్రయాణికుల సౌకర్యార్థం అవసరమైన సర్క్యులేటింగ్ ఏరియా, కాన్కోర్స్, ఫ్లాట్‌ఫాంలు, లైటింగ్‌లు, వెయిటింగ్ రూమ్‌లు, టాయిలెట్లు, ఎలివేటర్లు తదితర ప్రయాణికుల సౌకర్యాల ఏర్పాట్ల మంత్రి ప్రత్యక్షంగా సమీక్షించారు. దర్శనా జర్దోష్ మీడియాతో సంక్షిప్తంగా స్పందించారు. పునరాభివృద్ధి పనులు ప్రారంభించి 36 నెలల్లో పూర్తి చేస్తామని, ప్రయాణికులు, యాత్రికుల రాకపోకలకు అంతరాయం కలగకుండా ఈ పనులు చేపడతారు. ఆలయాల స్థానిక వాస్తుశిల్పంతో రూపొందించిన స్టేషన్ ముఖద్వారం నమూనాను కొనియాడారు. రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనుల సమీక్ష సందర్శనలో మంత్రితో తూర్పుకోస్తా రైల్వే ఖుర్దారోడ్ డివిజనల్ రైల్వే మేనేజర్ రింకేష్‌రాయ్, జోనల్ ప్రధాన కార్యాలయం, ఖుర్దారోడ్ మండల కార్యాలయం ఉన్నతధికారులు పాల్గొన్నారు.

సంస్కృతి, కళలతో కొత్త అనుభూతి



ప్రతినిధి బృందంతో చర్చిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

- జెన్ నెక్స్ట్ డెమోక్రసీ నెట్‌వర్క్ ప్రతినిధుల భేటీలో సీఎం నవీన్



ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో జెన్ నెక్స్ట్ డెమోక్రసీ నెట్‌వర్క్ ప్రతినిధులు

భువనేశ్వర్: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్ నిర్వహించిన జెన్‌నెక్స్ట్ డెమోక్రసీ నెట్‌వర్క్ ప్రోగ్రాం ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో శనివారం భేటీ అయ్యారు. వీరంతా 10రోజుల భారత్ పర్యటనకు రాగా.. ఇందులో రాష్ట్ర సందర్శనలో సీఎంతో సమావేశం కావడం విశేషం. ఈ బృందాన్ని ముఖ్యమంత్రి పట్నాయక్ సాదరంగా స్వాగతించారు. రాష్ట్ర మనోహరమైన కళ, వాస్తుశిల్పం, సంస్కృతి, వారసత్వం, రాష్ట్ర సహజ వనరులు, సుస్థిర పాలనతో కొనసాగుతున్న పరివర్తన ఇతరేతర అంశాలను ప్రతినిధి బృందానికి వివరించారు. రాష్ట్ర కళలు, సంస్కృతి, నిరంతర అభివృద్ధి కార్యకలాపాలు చక్కని అనుభూతి మిగుల్చుతాయని ప్రతినిధి బృందం పర్యటనను ప్రోత్సహించారు. బెల్జియం, బ్రెజిల్, బల్గేరియా, క్రొయేషియా, గయానా, మంగోలియా, పోర్చుగల్, దక్షిణాఫ్రికా వంటి 8 దేశాల సభ్యులు లోక్‌సేవా భవన్‌లోని కన్వెన్షన్ సెంటర్‌లో కలిశారు. దేశ స్వాతంత్ర్యం 75 సంవత్సరాలు పూర్తి పురస్కరించుకుని, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా 75 దేశాల నుంచి సభ్యులు భారత దేశానికి రానున్నారు. ఒడియా భాష, సాహిత్యం, సంస్కృతి అదనపు ప్రధాన కార్యదర్శి సత్యవ్రత సాహు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాస్వామ్య వ్యవస్థ గురించి తెలుసుకోవడానికి ప్రతినిధులు కోణార్క్, హరిరాజ్‌పూర్, స్టేట్ మ్యూజియం, మారిటైమ్ మ్యూజియం అసెంబ్లీని సందర్శించారని వివరించారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నాయకత్వంలో కళలు, సాంస్కృతిక రంగాల్లో రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రతినిధులు ప్రశంసించారు. ప్రతినిధి బృందం భేటీ కార్యక్రమంలో పలువురు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తప్పిన పెను ప్రమాదం


రోడ్డుపై విరిగి పడిన విద్యుత్ స్తంభాలు,మర్రి చెట్టు కొమ్మ

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బాతుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం ఉదయం పెద్ద మర్రిచెట్టు కొమ్మ విరిగి విద్యుత్ తీగలపై పడింది. దీంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగి తీగలతో పాటు రోడ్డుపై పడ్డాయి. ఈ సమయంలో ప్రయాణికులు, వాహనాలు రాకపోకలు లేకపోవడం పెను ప్రమాదం తప్పింది. స్థానికులు గుర్తించి వెంటనే సంబంధిత శాఖాధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. ప్రమాదకరమైన సంఘటన చోటు చేసుకున్నప్పటికి ఎలాంటి అపాయం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్పందించిన అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని తగు చర్యలు చేపట్టారు.

షెడ్ల నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం


విరాళాన్ని ఈవోకు అందజేస్తున్న దాతలు

అరసవల్లి: ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయ ఇంద్ర పుష్కరిణి మార్గంలో నిర్మించ తలపెట్టిన జింకు రేకు షెడ్ల నిర్మాణానికి నగరానికి చెందిన లైఫ్‌స్టైల్ ఫర్నిచర్ షోరూం అధినేత లాడె చంద్రశేఖర్, లాడె నాగరాజులు చెరో రూ.లక్ష చొప్పున మొత్తం రూ.2 లక్షల విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఆలయ పాలక మండలి సభ్యుడు మండవిల్లి రవి ఆధ్వర్యంలో దాతలు ఈ విరాళాన్ని ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్‌కు అందించారు. ఈ సందర్భంగా మండవల్లి రవి మాట్లాడుతూ దాతల సహకారంతోనే ఆలయంలో వరుసగా షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, అవకాశమున్న భక్తులు తమ వంతుగా ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్ మాట్లాడుతూ ఆలయానికి ఏ రూపంలోనైనా రూ.లక్ష వరకు విరాళమిచ్చిన దాతలకు ప్రత్యేక పర్వదినాల్లో విశిష్ట దర్శనాలకు వీలుగా దాతల పాసులను అందజేస్తామని ప్రకటించారు.

షూటింగ్ బాల్ సీనియర్ బాలురు, బాలికల జట్ల ఎంపిక


పాతపట్నం: జిల్లా జట్టుకు ఎంపికైన షూటింగ్ బాల్ సీనియర్ బాలురు, బాలికలు

పాతపట్నం: జిల్లాస్థాయి షూటింగ్‌బాల్ సీనియర్ బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశామని జిల్లా షూటింగ్ బాల్ జిల్లా అధ్యక్షుడు శిమ్మ కృష్ణారావు, కార్యదర్శి తంగి మురళీ మోహన్‌లు తెలిపారు. మండలంలోని పెద్దసీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా జట్టును ఎంపిక చేశామన్నారు. జిల్లా నుంచి వివిధ ప్రాంతాలను 65మంది క్రీడాకారులు హాజరు కాగా 12 మంది బాలురు, 12 మంది బాలికలను ఎంపిక చేశామని అధ్యక్షుడు తెలిపారు. ఈ నెల 22, 23వ తేదీల్లో అనంతపురంలో జరిగే పోటీలకు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.రామమూర్తి, సెక్రటరీ మధు, పీడీ శేఖర్‌బాబు, టి.ఈశ్వరరావు, శాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో భక్తజనం


సాధారణ క్యూలైన్లలో భక్తులు

అరసవల్లి: చైత్ర మాస ఏకాదశి పర్వదినం సందర్భంగా అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఇతర ప్రాంతాల నుంచి ఆదివారం వేకువజామునకే చేరుకుని ఆదిత్యుని దర్శనానికి బారులు తీరారు. ఆలయంలో ప్రత్యేక రోజు కావడంతో విశేష అలంకరణతో ఉదయం 6 గంటల నుంచే సర్వదర్శనాలకు ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ అనుమతిచ్చారు. భక్తులకు ఉచితంగా మజ్జిగ, మంచినీరు, ప్రసాదాలను పంపిణీ చేసేలా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఏర్పాట్లు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ నిమ్మ వెంకటరావు కుటుంబసమేతంగా ఆదిత్యుడిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ ప్రత్యేకంగా దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలను అందజేయించారు. ఆలయ పాలక మండలి సభ్యులు మండవిల్లి రవి, నెమలపురి కోటేశ్వర చౌదరి తదితరులు భక్తులకు ప్రసాదాలను, స్వామి లామినేటెడ్ చిత్రపటాలను పంపిణీ చేశారు.

ఆమ్ ఆద్మీతోనే అభివృద్ధి సాధ్యం


భువనేశ్వర్: నగర వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆప్ కార్యకర్తలు

● ఆప్ జిల్లా కన్వీనర్ శిశిర్‌కుమార్ భంజ్

పర్లాకిమిడి: ఢిల్లీ, పంజాబ్ స్థాయిలో ఒడిశాలో కూడా ఆప్ ప్రభుత్వాలు ఏర్పడితే విద్య, ఆరోగ్యం, విద్యుత్, తాగునీరు, మహిళలకు ఉన్నత ఉద్యోగాలు లభిస్తాయని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ శిశిర్‌కుమార్ భంజ్ పేర్కొన్నారు. ఆప్ తోనే రాష్ట్ర వికాసం సాధ్యమని అభిప్రాయం వ్యక్తంచేశారు. జిల్లాలోని గుమ్మా బ్లాక్ కేంద్రం సంతపేట వద్ద పార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు బయోజ్ బెబర్తా నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో శిశిర్‌కుమార్ మాట్లాడారు. గుమ్మా సమితిలోని అన్ని పంచాయతీల్లో దిగువస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. సభలో గుమ్మా బ్లాక్‌లో తలెత్తుతున్న వివిధ మౌళిక సమస్యలు, రవాణా, తాగునీరు, ఇతర సమస్యలను జిల్లా నాయకులు శిశిర్‌కుమార్ భంజసమంతి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో నువాగడ బ్లాక్ కార్యదర్శి జోదాం లిమ్మా, జిల్లా కమిటీ సభ్యులు లగాస్ దాస్ బర్దన్, లుసిన్యా గమాంగో, కుమార్ సింగ్, ఫ్రింటిన్ సింగ్, చిరంజీవి పాల్ తదితరులు పాల్గొన్నారు.


భువనేశ్వర్: మాస్టర్ క్యాంటీన్ ఛక్ ప్రాంతంలో ఆప్ కార్యకర్తల నిరసన సభ

ఆప్ కార్యకర్తల నిరసన..

భువనేశ్వర్: ఆమ్ ఆద్మీ పార్టీ ఆప్ రాష్ట్రశాఖ కార్యకర్తలు నగరంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రధాని నరేంద్రమోడీకి నినాదాలతో పరిసరాలు హోరెత్తించారు. కేంద్రప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై సీబీఐ దర్యాప్తుకు ఆదేశించిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో సీబీఐ ఆయనకు సమన్లు జారీ చేసిందని, దీనిని తప్పుడు చర్యగా పరిగణించి ఆందోళనకు దిగారు. గౌతమ్ ఆదానీపై మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టకున్నా.. ప్రజలకు మేలు చస్తున్న తమ నాయకుడిపై దర్యాప్తు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.


పర్లాకిమిడి: మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ శిశిర్‌కుమార్ భంజ్

రాష్ట్రంలో మరో కోవిడ్ మృతి



● గత 24 గంటల్లో 308 కరోనా కేసులు నమోదు

భువనేశ్వర్: రాష్ట్రంలో యాక్టివ్ కోవిడ్-19 కేసుల పెరుగుదల కొనసాగుతోంది. గత 24 గంటల్లో 308 కొత్త కేసులు నమోదయ్యాయి. వీటిలో 40శాతం సంక్రమణ కేసులుగా ఖరారయ్యాయి. అలాగే కరోనాతో మరో మరణం నమోదైంది. దీంతో ఈ ఏడాదిలో ఇది మూడో మృతిగా అధికారులు వెల్లడించారు. మృతుడు సోన్‌పూర్ జిల్లాకు చెందిన 70 ఏళ్ల వృద్ధుడిగా గుర్తించారు. డయాబెటిస్ మెల్లిటస్, హైపర్‌టెన్షన్, సెరిబ్రల్ వాస్కులర్ యాక్సిడెంట్‌తో బాధపడుతున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి. కోవిడ్ తీవ్రత అధికం కావడతో కొద్ది రోజుల క్రితం ఉన్నత చికిత్స కోసం వీరిని ఐసీయూలో చేర్చారు. చికిత్స కొనసాగుతుండగా తుదిశ్వాస విడిచారు. ఆరోగ్యశాఖ సమాచారం ప్రకారం రాష్ట్రంలో 1,505 క్రియాశీల కేసులు ఉండగా.. రోజువారీ పరీక్ష పాజిటివిటీ రేటు 5.1శాతానికి పెరిగింది. ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో గత 24 గంటల్లో 5,931 నమూనాలను పరీక్షించారు. వీటిలో 308 కొత్త కేసులు నమోదు చేయగా, యాక్టివ్ కేసుల సంఖ్య 1,505కి చేరుకుంది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా 204మందికి కరోనా సోకినట్లు పరీక్షల్లో వెల్లడించారు. అలాగే గత 24గంటల్లో 97మంది రోగులు చికిత్సతో కోలుకున్నట్లు ప్రకటించారు. గత వారంలో 2 మరణాలు నమోదైన విషయం తెలిసిందే.

నవరంగపూర్‌లో..

మరోవైపు కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలను వేగవంతం చేయాలని రాష్ట్రప్రభుత్వం జిల్లా అధికారులను ఆదేశించింది. కరోనా సంక్రమణకు క్లెం వేసే చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ నేపథ్యంలో హోం ఐసోలేషన్‌లో ఉన్న వ్యక్తులపై వస్తున్న వార్తలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. సుందర్‌గడ్, నవరంగ్‌పూర్, కటక్, సంబల్‌పూర్‌లో క్రియాశీల కేసులు అత్యధికంగా నమోదవుతున్నాయి. ఈ ప్రాంతాల్లో 26మందిని ఆస్పత్రుల్లో చికిత్స కోసం భర్తీ చేయగా, నలుగురికి ఐసీయూలో చికిత్స కొనసాగుతోంది. అలాగే నవరంగపూర్‌లో కరోనా సంక్రమణ ఛాయలు తారసపడ్డాయి. ఇద్దరు వ్యక్తులు స్థానిక మేళాకు హాజరైన తరువాత కరోనా బారిన పడినట్లు పరీక్షల్లో తేలింది. వీరిలో ఒకరు ఛత్తీస్‌గడ్‌కు చెందిన వ్యక్తి కావడం విశేషం. సరిహద్దు రాయ్‌ఘర్, ఉమర్‌కోట్ మండలాల్లో అధిక కేసులు నమోదవుతున్నాయి. రాష్ట్ర ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ నిరంజన్ మిశ్రా నేతృత్వంలో అధికారుల బృందం సోమవారం నుంచి నవరంగ్‌పూర్, మల్కన్‌గిరి, ఇతర జిల్లాలను సందర్శించనుందని అధికార వర్గాల సమాచారం.

తల్లి మందలించిందని..

● నదిలో దూకి బాలిక ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైమ్ : కన్న తల్లి కాస్త కటువుగా మాట్లాడిందని ఓ బాలిక బలవన్మరణానికి పాల్పడింది. చదువుకోకుండా టీవీ ఎందుకు చూస్తున్నావు అని మందలించినందుకు ఏకంగా ప్రాణాలు తీసుకుంది. శ్రీకాకుళంలోని ముచ్చువానిపేటకు చెందిన ఆకుల ఢిల్లీశ్వరి(14) శనివారం రాత్రి నాగావళిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. రెండో పట్టణ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం..

మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగం చేస్తున్న ఆకుల గణేష్, సరస్వతి దంపతులకు ఇద్దరు సంతానం. వీరిలో పెద్ద కుమారుడు శంకర్ వైజాగ్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కుమార్తె ఢిల్లీశ్వరి గుజరాతీపేటలోని ఏవీఎస్ఎం స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. శనివారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో కుమార్తె టీవీ చూస్తుండటంతో తల్లి వచ్చి మందలించారు. పరీక్షలు మొదలయ్యాయని, చదువుకోవాలని గదిమారు. దీంతో కుమార్తె మనస్తాపానికి గురై 9.30 గంటల సమయంలో బయటకు వెళ్లేందుకు ప్రయత్నించింది. వెంటనే తల్లి ఆమెను బుజ్జగించి నచ్చజెప్పి ఇంటికి తీసుకువచ్చారు. కానీ రాత్రయ్యాక బాలిక మళ్లీ ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాత్‌రూమ్ కోసం లేచిన తల్లికి కుమార్తె కనిపించకపోవడంతో కంగారుపడి అంతా వెతికారు. భర్తను నిద్ర లేపి, వైజాగ్‌లో ఉన్న కుమారుడికి కూడా ఫోన్ చేసి రాత్రంతా నగరమంతా గాలించారు. కానీ ఎక్కడా ఆమె ఆచూకీ దొరకలేదు.


నదిలోంచి బాలిక శవాన్ని బయటకు తీస్తున్న పోలీసులు

ఆదివారం ఉదయం దత్తాత్రేయ గుడి సమీపంలో ఉన్న నాగావళి నదిలో ఎవరో బాలిక మృతదేహం ఉందని తెలిసింది. కీడు శంకిస్తూనే తల్లిదండ్రులిద్దరూ అక్కడకు వెళ్లి చూడగా.. ఢిల్లీశ్వరి విగతజీవిగా కనిపించింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె నదిలో శవమై కనిపించడంతో వారు తల్లడిల్లిపోయారు. పోలీసులకు కూడా సమాచారం అందడంతో క్లూస్ టీమ్‌తో పాటు రెండో పట్టణ ఎస్ఐ వి.సందీప్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ శేషు, రైటర్ సింహాచలం, కానిస్టేబుల్ నాయుడు, మహిళా కానిస్టేబుల్ మీన వెళ్లి బాలిక మృతదేహాన్ని బయటకు తీశారు. ఒంటిపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో ఆత్మహత్యే అయి ఉంటుందని భావించిన పోలీసులు పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.


బాలిక శవాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసరావు చెప్పారు. పిల్లల భవిష్యత్ కోసమే తల్లిదండ్రులు మందలిస్తూ ఉంటారని, కాసింత కటువుగా మాట్లాడితే ఇలా కడుపుకోతకు గురి చేయడం భావ్యం కాదని సీఐ అన్నారు. ఈ వైఖరిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

5 దేశాల్లో 'పల్లెగూటికి పండగొచ్చింది'విడుదల

టెక్కలి: జిల్లాలోనే పూర్తి స్థాయిలో షూటింగ్ నిర్వహించిన 'పల్లెగూటికి పండగొచ్చింది' సినిమాను మే 26న 5 దేశాల్లో విడుదల చేస్తున్నట్లు సినిమా నిర్మాత, దర్శకుడు కంచరాన తిరుమలరావు వెల్లడించారు. సినిమా నటీనటులతో కలిసి ఆదివారం టెక్కలిలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు సందేశాత్మకంగా లక్ష్మీ ఫిల్మ్ ప్రొడక్షన్స్‌పై ఈ చిత్రాన్ని రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, కేరళ రాష్ట్రాలతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్, మలేషియా, దుబాయ్ వంటి దేశాల్లో మొత్తం 400 థియేటర్లలో ఈ సినిమాను విడుదల చేస్తున్నామని తిరుమలరావు వెల్లడించారు. సమావేశంలో నటీనటులు కె.రామ్‌ప్రసాద్, వి.మల్లయ్య, అమ్మ రామకృష్ణ, సాక్షి, మురళీధర్, రవితేజ, షణ్ముఖ, కృష్ణ, బి.ఉదయ్, అఖిల్, మధు, సింహాచలం శ్రీను పాల్గొన్నారు.


టెక్కలిలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పల్లెగూటికి పండగొచ్చింది సినిమా నిర్మాత, దర్శకుడు తిరుమలరావు, నటీనటులు.

కోవెల..కళకళ

● రెండు శతాబ్దాల నాటి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం జీర్ణోద్ధరణ
● రూ.16లక్షలతో ఆలయ సుందరీకరణ
● దాతల సహకారంతో పనులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలో రెండు వందల ఏళ్ల నాటి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని దాతల సాయంతో భక్తులు బాగు చేసుకుంటున్నారు. తుమ్మావీధిలో ఉన్న ఆలయం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నడుస్తోంది. అయితే చాలాకాలంగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఆలయం వెలుగులోకి రాలేదు. నగరం నడిబొడ్డులో ఉన్న ఈ ఆలయానికి కిల్లిపాలెం, పాత్రునివలస, అరసవల్లిలో కలసి వ్యవసాయ భూమి 5.04 ఎకరాలు ఉంది. దీని ద్వారా ఫలసాయం కింద ఏడాదికి రూ.52,900లు వస్తుంది. పట్టణంలోని వీరన్న షెడ్డు దగ్గర 32 సెంట్లు ఖాళీ స్థలం ఉంది. దీన్ని త్వరలో లీజుకు అప్పగించేందుకు దేవదాయ శాఖ చర్యలు తీసుకుంటోంది. ఆలయం ఆవరణ పుష్కరిణితో కలిపి 1.64 ఎకరాలు ఉంటుంది. 2010లో పక్కన ఉన్న ఆలయ స్థలం 59 సెంట్లను విక్రయించారు. ఆ ఆదాయాన్ని బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ వడ్డీతోనే ఆలయ నిర్వహణ, అర్చకుల జీతభత్యాలు, సిబ్బంది జీతాలు నడుస్తున్నాయి.

దాతల సహకారంతో..

చాలాకాలంగా ఈ ఆలయం మరుగున పడిపోయింది. కాశిని వేంకటేశ్వరరావు అనే భక్తుడు మొదటగా ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. అక్కడి నుంచి పనులు వేగం పుంజుకున్నాయి. ఆలయం చుట్టూ ఉన్న స్థలాన్ని కాపాడే పనిలో భాగంగా ఒక భక్తుడు ఫెన్సింగ్ ఏర్పాటు చేయగా, మరో భక్తుడు ఆలయ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి చదును చేశారు. తర్వాత పుష్కరిణి వరకు మార్గం చదును జరిగింది. దాని ఒడ్డున ఆలయానికి ఎదురుగా సుందరంగా ఉండే విధంగా పార్కులా నిర్మించి అందులో విష్ణు భక్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయ మండపం చుట్టూ ఖాళీగా ఉండడంతో కుక్కలు, పశువులు వస్తుండడంతో దాని చుట్టూ పిట్టగోడ కట్టించి గ్రిల్స్ వేయించారు. భోగమండపానికి టైల్స్ వేయించారు. ఆలయ ప్రాంగణంలో కూర్చునేందుకు వీలుగా సిమ్మెంటు బెంచీలు వేయించారు. ఆలయానికి నీటి వసతి కోసం బోరింగ్ కూడా వేయించారు. వీటన్నింటి కోసం భక్తులే రూ.16 లక్షల వరకు విరాళాలు ఇచ్చారు. కాశిని రమణమ్మ రూ.ఒక లక్ష, రెడ్డి రవికుమార్ రూ.ఒక లక్ష, బోర అప్పలనరసమ్మ రూ.ఒక లక్ష, నడగ జగదీశ్వరరావు రూ.2.65లక్షలు, అంపలాం శేషగిరి రూ.2లక్షలు, చలపాక నరసయ్య రూ.50వేలు, పుణ్యపు కూర్మారావు రూ.50వేలు, దొండపాటి నవీన్ రూ.48వేలు, సాసుమాన రామినాయుడు రూ.70వేలు ఇచ్చారు. కట్టబాబు అనే దాత ఆలయ గర్భగుడిలో ఉన్న టైల్స్ తొలగించి గ్రానైట్ పనులు చేయిస్తున్నారు.


ప్రస్తుతం ఉన్న స్థితి

నిర్వాసితులకు సపోర్ట్


మూలపేట పోర్టు నిర్వాసితులకు కాలనీ నిర్మించనున్న ప్రదేశం

● మూలపేట పోర్టు నిర్వాసిత రైతులకు చకచకా పరిహారం చెల్లింపు
● నౌపడ సమీపంలో నిర్వాసిత కాలనీకి 58 ఎకరాలు ఇచ్చిన రైతులు
● సుమారు రూ.35 కోట్లతో అత్యాధునికంగా నిర్వాసిత కాలనీ

టెక్కలి: ఉత్తరాంధ్ర తీరానికి మణిహారంగా మారనున్న సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి సంబంధించి పరిహారం పంపిణీని ప్రభుత్వం వేగవంతం చేసింది. ఒక వైపు పోర్టు కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లిస్తూ... మరో వైపు నిర్వాసితులకు కాలనీ కోసం భూములు ఇచ్చిన రైతులకు కూడా పరిహారం చెల్లింపులు వేగవంతం చేస్తున్నారు. ఈ నెల 19న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూలపేట పోర్టు శంకుస్థాపనకు రానున్నారు. ఆయన పర్యటనకు మునుపే పరిహారం చెల్లింపులు చేస్తుండడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


అత్యాధునికంగా నిర్వాసిత కాలనీ

మూలపేట పోర్టు నిర్మాణంలో భాగంగా పూర్తిగా నిర్వాసితులైన మూలపేట, విష్ణుచక్రం గ్రామాలకు చెందిన సుమారు 594 మందికి సరిపడే విధంగా నౌపడ సమీపంలో అత్యాధునికంగా కాలనీ నిర్మాణం చేపట్టనున్నారు. సుమారు రూ.35 కోట్లతో కాలనీ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు.

- ఈ కాలనీకి సంబంధించి 52 మంది రైతుల నుంచి 58 ఎకరాలను సేకరించారు.
- మొత్తం రూ.15.80 కోట్లు చెల్లించనున్నారు.
- ప్రస్తుతానికి 30.98 ఎకరాలకు సంబంధించి సుమారు 41 మంది రైతులకు రూ. 8.5 కోట్లకుగాను ఇప్పటికే రూ. 5.48 కోట్లు చెల్లించారు. మిగిలినవి క్రమంగా చెల్లిస్తున్నారు.

● భద్రతా ఏర్పాట్ల పరిశీలన


నౌపడలో సీఎం సభ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న డీఐజీ హరికృష్ణ, ఎస్పీ రాధిక, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

సంతబొమ్మాళి: మూలపేట, నౌపడలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ ఆదివారం పరిశీలించారు. ట్రాఫిక్ మళ్లింపు, వీవీఐపీ వాహనాల పార్కింగ్, హెలీప్యాడ్, ప్రోటోకాల్ నిర్వహణ తదితర అంశాలపై ఎస్పీ జీఆర్ రాధికను అడిగి తెలుసుకున్నారు. విష్ణుచక్రంలో నిర్మితమవుతున్న పైలాన్, నిర్వాసితులతో సీఎం సమావేశ ప్రాంగణం, మూలపేటలో సిద్ధం చేసిన హెలీప్యాడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావు, కాశీబుగ్గ డీఎస్పీ శివరాం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● ఫిషింగ్ హార్బర్ మత్స్యకారులకు వరం

గార: బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరగడం మత్స్యకారులకు వరమని జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడు కోనాడ నర్సింగరావు అన్నారు. బందరువానిపేట గ్రామంలో స్థానిక నాయకులతో కలసి ఆదివారం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకనే మత్స్యకారులకు భరోసా దొరికిందన్నారు. వేట నిషేధ సమయంలో భృతిని రూ.నాలుగు వేలు నుంచి రూ.పదివేలుకు పెంచడంతోపాటు సముద్ర ప్రమాదంలో చనిపోతే పరిహారాన్ని వెనువెంటనే ఇవ్వడం జరుగుతుందన్నారు. మత్స్యకారులకు హార్బర్ వల్ల వేట సులువు కావడంతో పాటు మత్స్యసంపద తరలించేందుకు మంచి అవకాశం ఉంటుందన్నారు. జిల్లా అభివృద్ధికి బాటలు వేసేలా మూలపేట వద్ద పోర్టు నిర్మాణం పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. జిల్లాకు చెందిన రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బర్రి వంశయ్య, దుమ్ము లక్ష్మయ్య, సిద్ధా రామారావు, పుక్కళ్ల కృష్ణ, మైలపల్లి పోలీసు, రాజు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడు కోనాడ నర్సింగరావు

● 'సీఎం సభకు తరలివెళ్దాం'

నరసన్నపేట: ఈ నెల 19న సంతబొమ్మాళి మండలం నౌపడ కూడలి వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బహిరంగ సభ ఉందని, కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో ఈ మేరకు పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహించారు. మండలాల నుంచి నాయకులు బాధ్యత తీసుకుని సభకు వచ్చే ప్రజలకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ రోజు నుంచే గ్రామాల్లో సీఎం సభ కోసం ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు ముద్దాడ బైరాగినాయుడు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్ లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

క్లుప్తంగా

నెల్లిమర్లలో షూటింగ్ సందడి



షూటింగ్‌లో పాల్గొన్న కమెడియన్ వెన్నెల కిశోర్

నెల్లిమర్ల: పట్టణంలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. కొండపేట, థామస్‌పేట ప్రాంతాలతో పాటు చంపావతి నదీ తీరంలో కమెడియన్లు వెన్నెల కిశోర్, జబర్దస్త్ కమెడియన్ అప్పారావులపై కొన్ని సన్నివేశాలను ఆదివారం చిత్రీకరించారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ వాసులు, చుట్టుపక్కల గ్రామస్తులు వారిని చూసేందుకు ఎగబడ్డారు. వారు కూడా తమ అభిమానులతో సెల్ఫీలు దిగి, ఆనందం వ్యక్తం చేశారు.

పూరిల్లు, పశువుల శాల దగ్ధం



ప్రమాదంలో గాయపడిన ఆవులు

దత్తిరాజేరు: షార్ట్‌సర్క్యూట్ కారణంగా మండలంలోని ఎం. లింగాలవలస గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు, పశువుల శాల దగ్ధమయ్యాయి. ఈ దుర్ఘటనలో పాడిరైతు మజ్జి కృష్ణకు చెందిన మూడు ఆవులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయంపై గజపతినగరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చామని గ్రామస్తులు తెలిపారు.

ఆటో బోల్తా: విద్యార్థి మృతి



మృతి చెందిన అఖిల

రామభద్రపురం: ఆటో బోల్తాపడిన దుర్ఘటనలో విద్యార్థిని అఖిల(8) దుర్మరణం చెందింది. ఈ ప్రమాదం మండలంలోని బూసాయవలస వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ పట్నాన లక్ష్మణ తన ఆటోలో షికారుకు అని, తన అన్నయ్య శంకరరావు కూతురు అఖిల, కొడుకును తీసుకుని ప్రయాణమయ్యాడు. సరిగ్గా బూసాయవలస వద్ద చర్చికి సమీపంలో ఆటో తిప్పుతుండగా అదుపు తప్పి, బోల్తాపడింది. దీంతో తీవ్రగాయాలపాలైన అఖిలను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి శంకరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు.

ఆగంతుకుడి చేతిలో గాయపడిన మహిళ మృతి



ఆస్పత్రిలో మృతి చెందిన సూర్యకాంతం

కొత్తవలస: ఆగంతుకుడి చేతిలో తీవ్రంగా గాయపడి, విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మాదాబత్తుల సూర్యకాంతం(56) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు సీఐ ఎస్.బాలసూర్యారావు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి.. శనివారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని కుమ్మరి వీధిలో నివాసముంటున్న సూర్యకాంతం ఇంట్లోకి ఓ ఆగంతుకుడు చొరబడి, ఆమె కళ్లల్లో కారం కొట్టి, తలపై ఓ పదునైన ఆయుధంతో బలంగా మోది గాయపరిచాడు. అనంతరం ఆమె మెడలోని 3 తులాల పుస్తెలతాడు, చెవిదిద్దులు తీసుకుని పరారయ్యాడు. భోజనం కోసమని ఇంటికి చేరుకున్న ఆమె కొడుకు గణేష్ రక్తపు మడుగులో ఉన్న తల్లిని చూసి కన్నీరుమున్నీరై, చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అయితే తెల్లవారుజామునే ఆమె చనిపోయినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని, ఇప్పటికే క్లూస్ టీమ్, డీఎస్పీ ఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారని తెలిపారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

నెల్లిమర్ల: మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడు పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఆదివారం పరీక్ష నిర్వ హించారు. నెల్లిమర్ల, విజయనగరం, కొత్తవలస, గంట్యాడ, గజపతినగరం, బొబ్బిలి ప్రాంతాల్లోని పాఠశాలల్లో నిర్వహించిన పరీక్షకు 1061 మంది విద్యార్థులు హాజరయ్యారు. 89 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు గురుకులాల జిల్లా కన్వీనరు డాక్టర్ కేబీబీ రావు తెలిపారు. నెల్లిమర్ల బాలికల పాఠశాలలో 191 మందికి 174 మంది, మత్స్యకార బాలుర పాఠశాలలో 19 మందికి 18 మంది, విజయనగరం పాఠశాలలో 90 మందికి 76 మంది, కొత్తవలస పాఠశాలలో 280 మందికి 251 మంది, గజపతినగ రం పాఠశాలలో 145 మందికి 139 మంది, బొబ్బిలి పాఠశాలలో 227 మందికి 211 మంది, గంట్యాడ పాఠశాలలో 199 మందికి 183 మంది హాజరైనట్లు చెప్పారు.

24,318 సంఘాలు..
రూ. 912 కోట్ల రుణాలు



- 2022 - 23లో స్వయం సహాయక సంఘాలకు విరివిగా రుణాలు
- ఈ ఏడాది రూ.వెయ్యి కోట్లు పైబడి లక్ష్యం
- రుణాలతో అభివృద్ధి పథంలో డ్వాక్రా మహిళలు

మహిళలను మహారాణులుగా మార్చాలని జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు కంకణం కట్టుకుంది. అందుకనుగుణంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలను విరివిగా అందజేస్తోంది. తద్వారా మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదిగేందుకు సహాయ పడుతోంది. ఆ దిశగా చేపట్టిన చర్యలు ప్రస్తుతం సత్ఫలితాలు ఇస్తున్నాయి. మహిళలు తమ కుటుంబాలకు ఆసరాగా నిలబడుతూ ముందుకు సాగుతున్నారు.

నెల్లిమర్ల:

రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలను విరివిగా మంజూరు చేస్తోంది. 2022 - 23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 24,318 సంఘాలకు రూ.912 కోట్లు రుణాలుగా అందజేసింది. ప్రభుత్వం మంజూరు చేసిన రుణాలతో మహిళలు వ్యాపారాలను, కుటీర పరిశ్రమలను ప్రారంభించారు. తద్వారా అభివృద్ధి పథంలో పయనిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ రుణాల మొత్తాన్ని రూ.వెయ్యి కోట్లు దాటించాలని డీఆర్‌డీఏ - వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

జిల్లాలో 1038 గ్రామైక్య సంఘాలు, 39,997 స్వయం సహాయక సంఘాలున్నాయి. ఆయా సంఘాల్లో 4.5 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు విరివిగా బ్యాంకు లింకేజీ రుణాలను మంజూరు చేస్తోంది. 2021 - 22 ఆర్థిక సంవత్సరంలో 24,216 సంఘాలకు రూ.908 కోట్లు మంజూరు చేసింది. 2022 - 23 సంవత్సరంలో 24,318 సంఘాలకు రూ.912 కోట్లు రుణాలుగా అందజేసింది. ఒక్కో సంఘానికి కనిష్ఠంగా రూ.50వేలు, గరిష్ఠంగా రూ.20 లక్షలు రుణాలుగా మంజూరు చేసింది.

జిల్లా:	విజయనగరం
స్వయం సహాయక సంఘాలు:	39,997
సంఘాల్లో మహిళల సంఖ్య:	4.5 లక్షలు
2022 - 23లో మంజూరు చేసిన రుణాలు:	రూ.912 కోట్లు
రుణాలు తీసుకున్న సంఘాలు:	24,318



స్వయం సహాయక సంఘాల మహిళలు

ముందు తీసుకున్న రుణాలు, పొదుపు మొత్తాల ఆధారంగా అర్హత కలిగిన ప్రతి సంఘానికి అధిక మొత్తంలో రుణాలను ప్రభుత్వం అందజేసింది. బ్యాంకుల నుంచి సంఘాలు తీసుకున్న రుణాల్లో రూ.3 లక్షల వరకు సున్నా వడ్డీ అమలవుతున్న విషయం తెలిసిందే. రూ.3 లక్షల కంటే ఎక్కువ మొత్తాలను తీసుకుంటే ఏడాదికి 12 శాతం వడ్డీ వసూలు చేస్తారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తాము తీసుకున్న రుణాలతో పాన్ షాపులు, జెరాక్స్ సెంటర్లు, కిరాణా దుకాణాలు, పశువుల, గొర్రెల డెయిరీలు తదితర వ్యాపార, కుటీర పరిశ్రమలను ప్రారంభించారు. తద్వారా ఆర్థికంగా అభివృద్ధి పథంలో పయనిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాల ద్వారా జిల్లాలోని మహిళల జీవన ప్రమాణాలు రోజురోజుకూ మెరుగుపడుతున్నాయి.

రుణంతో స్వయం ఉపాధి



రుణంతో కొనుగోలు చేసిన ఆవుతో దేవి

ఈ ఫోటోలోని మహిళ పేరు సాడి దేవి. నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామానికి చెందిన మీనాక్షి స్వయం సహాయక సంఘం సభ్యురాలు. ఈ సంఘానికి గతేడాది రూ.18 లక్షలు రుణం మంజూరైంది. తీసుకున్న రుణంతో దేవి ఆవును కొనుగోలు చేసి, తద్వారా జీవనోపాధిని పొందుతున్నారు. బ్యాంకు లింకేజీ రుణం తనకు ఎంతగానో ఉపయోగపడిందని చెబుతున్నారు.



ఈ ఫోటోలోని మహిళ పేరు కెల్ల భారతి. నెల్లిమర్ల మండలం సతివాడ గ్రామం మజ్జి గౌరి స్వయం సహాయక సంఘానికి చెందిన ఈమె రూ.75 వేలు బ్యాంకు లింకేజీ రుణం తీసుకున్నారు. ఆ రుణంతో గ్రామంలోనే పాన్ షాపు ప్రారంభించారు. తద్వారా ప్రతి నెలా కొంత ఆదాయం పొందుతున్నారు. బ్యాంకు లింకేజీ రుణం తన స్వయం ఉపాధికి ఉపయోగపడిందని భారతి సంతోషం వ్యక్తం చేశారు.

రూ.912 కోట్లు రుణాలుగా అందజేశాం



2022 - 23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 24,318 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందజేశాం. రూ.912 కోట్లు రుణాలుగా మంజూరు చేశాం. ఈ ఏడాది రూ.వెయ్యి కోట్లకు పైగా మొత్తాన్ని రుణాలుగా అందజేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. జిల్లా వ్యాప్తంగా రుణాల మంజూరు ఇప్పటికే ప్రారంభించాం. రుణాలు తీసుకునే మహిళలు సద్వినియోగం చేసుకుని,జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలి.

– ఎ.కల్యాణచక్రవర్తి, పీడీ, డీఆర్‌డీఏ

రామతీర్థంలో ప్రత్యేక పూజలు

- భక్తి శ్రద్ధలతో రామకోటి సమర్పణ



యాగశాలలో ప్రత్యేక హోమాలు చేస్తున్న అర్చక స్వాములు

నెల్లిమర్ల రూరల్:

పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయ అర్చకులు వేకువ జామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరాకాండ హవనం, ఆదిత్య హృదయం హోమాలను జరిపించారు. అనంతరం స్వామి మండపం వద్ద సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా జరిపించారు. ఏకాదశిని పురస్కరించుకొని భక్తులు ఏడాది పొడవునా సమర్పించిన రామకోటి పుస్తకాలను దేవాలయంలో ఊరేగించి ఆలయం వెలుపల ఉన్న రామక్రతు స్థూపంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ప్రతి ఏటా ఏకాదశి రోజున రామకోటి పుస్తకాలను నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోందని అర్చకులు తెలిపారు. అదే ఆనవాయితీని కొనసాగించినట్టు పేర్కొన్నారు. రామస్వామిని ఆంధ్రా విశ్వ విద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ వేణుగోపాల్‌రెడ్డి, అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ వెంకట్రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వీరుడా.. వందనం..

- నేవీ మెరైన్ కమాండో గోవింద్‌కు నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, సహోద్యోగులు, నేవీ అధికారులు



గోవింద్ సంతాప సభకు హాజరైన విశాఖపట్నం నేవీ సైనిక బృందం

చీపురుపల్లి: కోల్‌కతాలో ఇటీవల పారాగ్లైడింగ్ శిక్షణలో ప్రమాదవశాత్తు మరణించిన మండలంలోని పర్ల గ్రామానికి చెందిన నేవీ మెరైన్ కమాండో చందక గోవింద్‌కు ఘననివాళి లభించింది. ఆయన స్వగ్రామంలో ఆదివారం నిర్వహించిన సంతాప సభలో ప్రజాప్రతినిధులు, సహోద్యోగులు, విశాఖపట్నం నేవీ అధికారులు పాల్గొని, గోవింద్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం గోవిం ద్‌తో తమకున్న తీపి జ్ఞాపకాలను సహోద్యోగులు, అధికారులు పంచుకుని, కన్నీటి పర్యంతమయ్యారు. నువ్వు ఏ లోకంలో ఉన్నా సుఖంగా ఉండాలని ఆకాంక్షించారు. వీరుడా వందనం, జోహార్ సైనిక, గోవింద్ అమర్ రహే అని నినాదాలు చేశారు. దేశ రక్షణ కోసం శిక్షణ పొందుతూ ప్రాణాలు విడిచిన గోవింద్ ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచిపోతాడన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన మోసం

- పిల్లల చదువు కోసం దళారి చేతిలో మోసపోయిన ఓ తండ్రి
- సైనిక్ స్కూల్ సీటు కోసం రూ.16 లక్షల చెల్లింపు
- మోసగాడు ముఖం చాటేయడంతో బలవన్మరణం
- పెనుబాకలో విషాదం



రామకృష్ణ(ఫైల్)

రాజాం సిటీ: పిల్లల భవిష్యత్ బాగుండాలని కలలు కన్నాడు. ఎంత కష్టమైనా, ఎంత ఖర్చు అయినా పర్వాలేదు వారిని ఉన్నత స్థితిలో చూడాలనుకున్నాడు. సైనిక్ స్కూల్‌లో పిల్లలకు సీటు ఇప్పిస్తానని ఓ వ్యక్తి చెప్పిన మాటలు నమ్మాడు. దీనికి డబ్బులు అవుతాయని ఆయన డిమాండ్ చేయడంతో పిల్లల భవిష్యత్తు బాగుంటుందని సరేనన్నాడు. అప్పులు చేసి మరీ సదరు వ్యక్తికి డబ్బులిచ్చి, మోసపోయాడు. సీటు ఇప్పించకపోవడంతో ఇచ్చిన డబ్బులు ఇవ్వాలని అడగ్గా అతడు ముఖం చాటేయడంతో గత్యంతరం లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని పెనుబాక గ్రామానికి చెందిన బుడ్డెపు రామకృష్ణ(43) చిరు వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. తన ఇద్దరు పిల్లలను బాగా చదివించి, మంచి ప్రయోజకులను చేయాలనుకున్నాడు. కొన్నాళ్ల క్రితం ఈయనకు శ్రీకాకుళం జిల్లా, పొందూరు మండలం, బురిడి కంచరాం గ్రామానికి చెందిన జి.అసిరినాయుడుతో పరిచయం ఏర్పడింది. ఆయన సైనిక్ స్కూల్‌లో మీ పిల్లలకు సీటు ఇప్పిస్తానని, దానికి డబ్బులు ఖర్చు అవుతాయని చెప్పడంతో నిజమేనని నమ్మి, అప్పులు చేసి మరీ రూ.16 లక్షలు వరకు అప్పగించాడు. సైనిక్ స్కూల్‌లో సీటు రాకపోవడంతో తాను అప్పుతెచ్చి ఇచ్చిన మొత్తాన్ని(రూ.16 లక్షలు) తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశాడు. ఎన్నిసార్లు అడిగినా ఇవ్వలేదు. దీంతో ఈ ఏడాది మార్చి 31వ తేదీన బురిడికంచరాం గ్రామంలో ఉన్న అసిరినాయుడు ఇంటికి రామకృష్ణ, అతని భార్య రజని వెళ్లి, తమ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన నిరాకరించడంతో తన వెంట తీసుకువెళ్లిన పురుగుల మందు తాగి, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితికి వెళ్లడంతో భార్య రజని గ్రామస్తుల సహకారంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. అక్కడ కూడా తలకు మించిన ఖర్చు కావడంతో భరించలేక అక్కడి నుంచి రిమ్స్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం వేకువ జామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన జరిగిన తర్వాత ఇరువర్గాలకు సంబంధించిన పెద్దల సమక్షంలో బాధితులకు న్యాయం చేసేందుకు ప్రయత్నాలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. రామకృష్ణ మృతితో ఆయన స్వగ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఎప్పుడూ పిల్లల భవిష్యత్ బాగుండాలని, వారికోసం ఎంతదూరమైనా వెళ్లానని అంటుండేవాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

23 నుంచి రజతోత్సవాలు

విజయనగరం టౌన్: శ్రీపైడిమాంబ కళానికేతన్ ఆధ్యాత్మిక సేవా సంఘం రజతోత్సవాలు ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.సూర్యపాత్రో తెలిపారు. ఇదే విషయమై స్థానిక లేడీస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్సవాల ప్రారంభం రోజున సాయంత్రం భీష్మా ఆధ్వర్యంలో అన్నమయ్య కీర్తనలు ఉంటాయని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి హాజరవుతారని పేర్కొన్నారు. 24వ తేదీన జరిగే కార్యక్రమంలో మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి పాల్గొని, పైడితల్లి అమ్మవారి భక్తి పాటలను విడుదల చేస్తారన్నారు. అదేరోజు రాత్రి గెద్దవరప్రసాద్ నేతృత్వంలో సావిత్రి సవాల్ నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. 25వ తేదీన జరిగే కార్యక్రమానికి పూసపాటి అశోక్ గజపతిరాజు ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు. అదేరోజు విద్యార్థులతో భరతనాట్య ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో దవళ సర్వేశ్వరరావు, స్వప్న హైందవి, మానాప్రగడ సాహితి, పీవీఎస్ భానురాజా తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు అండగా డీసీసీబీ

- రైతులకు విత్తనాలు, ఎరువులు అందజేత
- 2022-23లో రూ.1561 కోట్ల రుణాలు మంజూరు
- జిల్లాలోని సొసైటీలు: 95
- డీసీసీబీ బ్రాంచిలు: 19
- ధాన్యం కొనుగోలులో చొరవ



డీసీసీబీ కార్యాలయం

విజయనగరం ఫోర్ట్:

రైతులకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) అండగా నిలుస్తోంది. రైతులతో పాటు మిగిలిన వర్గాల వారికి రుణాలు మంజూరు చేస్తోంది. అన్నివర్గాల ప్రజలకు ఆర్థిక చేయూతనిస్తోంది. గతంలో కేవలం రైతులకు మాత్రమే బ్యాంకు నుంచి రుణాలు ఇచ్చేవారు. దీనివల్ల పెద్దగా లాభాలు వచ్చేవికావు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత సహకార రంగం అభివృద్ధికి తోడ్పాటును అందించడంతో బ్యాంకు అధికారులు సేవలను విస్తృతం చేశారు. మిగిలిన బ్యాంకులకు దీటుగా తక్కువ వడ్డీకే వివిధ రకాల రుణాలు మంజూరు చేస్తున్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ చెల్లిస్తున్నారు. దీంతో రుణాలు తీసుకునేందుకు, బ్యాంకులో నగదు దాచుకునేందుకు అధికమంది ఆసక్తి చూపుతున్నారు. స్వయంసహాయక సంఘాల మహిళలకు, ఇతర వృత్తుల వారికి 9 శాతం వడ్డీ మించకుండా రుణాలు మంజూరు చేస్తున్నారు. డీసీసీబీ పరిధిలో 95 సొసైటీలు, 19 బ్రాంచిలు ఉన్నాయి. వీటి ద్వారా 2022-23 సంవత్సరంలో రూ.1561 కోట్లు రుణాలు మంజూరు చేశారు. సహకార మిత్ర పథకం కింద వాణిజ్య పంటల సాగుకు పెట్టుబడి కింద, పండించిన పంటకు మద్దతుధర రానప్పుడు పంటను దాచుకునేందుకు, డెయిరీల నిర్వహణ, ట్రాక్టర్లు, గొర్రెలు, మేకల యూనిట్ల కొనుగోలుకు రుణాలు ఇస్తున్నారు. రైతుల నుంచి ధాన్యంకొనుగోలు చేసి కమీషన్ ప్రాతిపదికన విక్రయిస్తుండడంతో సొసైటీలు ఆర్థిక ప్రగతిసాధిస్తున్నాయి.

డీసీసీబీ నుంచి 2022-23లో రుణాల మంజూరు ఇలా...

పంట రుణ విభాగం	అందించిన రుణం రూ.కోట్లలో
పంట రుణాలు	రూ. 1215 కోట్లు
స్త్రీనిధి రుణాలు	రూ. 30 కోట్లు
బంగారు రుణాలు	రూ. 134 కోట్లు
టిడ్కో ఇళ్లకు	రూ.5.52 కోట్లు
ఎస్‌హెచ్‌జీలకు	రూ. 65 కోట్లు
నాన్ ఫార్మర్స్‌కు	రూ. 11.7 కోట్లు
దీర్ఘకాలిక రుణాలు	రూ. 15.77 కోట్లు

విరివిగా రుణాలు మంజూరు

రైతులకు అన్నివిధాలా అండగా ఉండడం కోసం డీసీసీబీ ఏర్పాటయింది. విత్తనాలు, ఎరువులను రైతులకు అందిస్తున్నాం. రైతులు పండించిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నాం. రైతులు, వ్యవసాయ కూలీలకు రుణాలు మంజూరు చేస్తున్నాం. అధిక శాతం మంది రైతులు డీసీసీబీ వద్ద రుణాలు తీసుకుంటున్నారు.

– కె.జనార్దన, సీఈఓ, డీసీసీబీ

నిబంధనలు బేఖాతరు

- ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీల నిర్వహణ
- నిబంధనలకు విరుద్ధంగా చెరువులను ఆక్రమించి మరీ ఏర్పాటు
- అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టి తవ్వకాలు
- లక్షల్లో ఆదాయం ఆర్జిస్తున్న నిర్వాహకులు



బూసాయవలస ఎరకన్నదొర చెరువులో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీ

రామభద్రపురం: నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇటుక బట్టీలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కడికక్కడ ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తూ యజమానులు నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా చెరువుల గర్భాలను సైతం ఆక్రమించుకుని, ఏర్పాటు చేసేస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడి లాభాపేక్షే ధ్యేయంగా ఏ విధమైన అనుమతులు లేకుండా రాత్రి, పగలు అనే తేడా లేకుండా చెరువుల్లో మట్టి తవ్వకాలు చేసి, మట్టిపోగులు వేసుకుంటున్నారు. గృహాల నిర్మాణాల కోసం పేద ప్రజల విన్నపాలు కూడా లెక్క చేయకుండా వారి ఇష్టానుసారంగా వారికి నచ్చిన ధరకే ఇటుకలు విక్రయిస్తున్నారు. రూ.లక్షల్లో ఆదాయం ఆర్జిస్తున్నారు. ఇటుక బట్టీల నుంచి పంచాయతీలకు చెల్లించే సెస్ కూడా ఎగ్గొట్టేసి, బట్టీల నిర్వహణ ఏంచక్కా కానిచ్చేస్తున్నారు. పలు ప్రాంతాల్లోని బట్టీలకు పంచాయతీల అనుమతి లేకుండా అక్రమ మార్గంలో విద్యుత్ మీటర్లు కూడా పొందారనేది ప్రధాన ఆరోపణ. అలాగే సాగు భూములను వ్యాపార భూములుగా మార్చకుండానే బట్టీలు ఏర్పాటు చేశారని పలువురు అధికారులు చెబుతున్నారు.

ఇవీ.. నిబంధనలు..

- ఇటుకబట్టీలు ఏర్పాటుకు రెవెన్యూ, భూగర్భ గనుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి నుంచి తప్పనిసరిగా అనుమతి పొందాల్సి ఉంటుంది. ఇటుకల తయారీకి ఎక్కడి నుంచి మట్టి తీస్తారు.. ఎంత లోతు తీయాలి అనేదానిపై ముందుగానే వివరించి, శాఖా పరమైన అనుమతులు తీసుకోవాలి.
- ఇలా అనుమతులు పొందిన వ్యక్తులు మాత్రమే నిబంధనల ప్రకారం మట్టిని తరలించాలి. సొంత పట్టా పొలంలో నుంచి మట్టిని తీసినా అనుమతులు తీసుకోవాలి. రెవెన్యూ, మైనింగ్ శాఖకు చలానా రూపంలో నిర్ణీత డబ్బులు చెల్లించి అనుమతి పొందాలి.
- ఇటుక బట్టీల్లో విద్యుత్ సౌకర్యం కోసం కమర్షియల్ మీటర్ మాత్రమే ఉండాలి.
- కలప రవాణాకు ఫారెస్ట్ అధికారుల అనుమతులు తీసుకోవాలి. అలాగే కలపను ఎక్కడి నుంచి తెస్తున్నారు.. సమీప ప్రాంతాల్లో ఎంత మేరకు కలప తెస్తున్నారో తెలిపి నిబంధనల ప్రకారం చలానా తీయాలి.



ఇటుక బట్టీ కోసం బూసాయవలసలో కల్యాణ మండపం వెనక వేసిన మట్టిపోగు

ల్యాండ్ కన్వర్షన్ చేయలేదు..

బూసాయవలస, ముచ్చర్లవలస గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఇటుకబట్టీలకు ఆయా యజమానులు ఒక్కరూ కూడా ల్యాండ్ కన్వర్షన్ చేయలేదు. మట్టితవ్వకాలకు, విద్యుత్‌మీటర్ల ఏర్పాటుకు అనుమతులు పొందలేదు.

–ఆనందరావు, వీఆర్‌ఓ, బూసాయవలస సచివాలయం.

చర్యలు తీసుకుంటాం..

మండలంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఇటుకబట్టీ ల నిర్వాహకులు ఏ ఒక్కరూ ఏ విధమైన అనుమతులు తీసు కోలేదు. అనుమతులు లేకుండా బట్టీల నిర్వహణకు చెరువు ల్లో గానీ, సొంత పొలాల్లో గానీ అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ఉల్లంఘించి ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు.

– సుబ్బారావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్, రామభద్రపురం.